తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ సోమవారం 14 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3


## హామీలు అమలు చేయకుండా..

# ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య

ప్రజావారధి/మోత్కూరు

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతగాక సీఎం రేవంత్ రెడ్డి మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు రాంపాక నాగయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, లెక్కలేని హామీలతో అధికారంలోకి వచ్చారని, హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలెవరూ సంతోషంగా లేరన్నారు. యూరియా, సాగునీరు, విద్యుత్ ఇవ్వకపోవడంతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, రైతుబంధు కూడా ఎగ్గొట్టారన్నారు. వృద్ధులు, వికలాంగులకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ పెంపు ఏమైందని, మహిళలకు ఇస్తామన్న రూ.2500, విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళితులపై ప్రేమ ఒలకపోస్తున్న రేవంత్‌రెడ్డి మూడేళ్ల కాలంలో దళితుల సంక్షేమం కోసం ఏ పథకం అమలు చేశారో చెప్పాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన దళితబంధు రద్దు చేశారని, లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న నిధులు కూడా డ్రా చేయకుండా అడ్డు కుంటున్నారని తెలిపారు. దళితులను రాజకీయంగా వాడుకోవడం తప్పితే అసలైన దళిత ద్రోహి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు.



కల్యాణలక్ష్మీ, రైతుబీమా, ఫీజు రీయంబర్స్‌మెంట్, కేసీఆర్ కిట్ లాంటి పథకాలన్నింటికీ మంగళం పాడు తున్నారన్నారు. ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజలకు సమాధానం చెప్పడం చేతగాక ప్రభుత్వ కార్యక్రమైనా, పార్టీ కార్యక్రమైనా రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు కూడా ప్రభుత్వంపై తిరగబడుతున్నారని, కాంగ్రెస్ పాలనతో తెలంగాణలోని సబ్బండ వర్గాల ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే మూడేళ్ల పాలన ముగిసిందని, మరో రెండేళ్ల ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల ముందు తాత్కాలిక పథకాలు అమలు చేసి, డబ్బుల మూటలతో ఓట్లు కొల్లగొట్టవచ్చని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని, తెలంగాణ ప్రజలు అంతా అమాయకులు కాదని, ఏదీ మర్చిపోరని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

- హామీలు అమలు చేయకుండా చిల్లర మాటలేంది
- బీఆర్ఎస్ నాయకులను తిట్టడం తప్ప మూడేళ్లలో చేసిందేమిటి
- దళితుల సంక్షేమం కోసం ఒక్క పథకమైనా అమలు చేరాశా
- ఎన్నికల ముందు పథకాలు, డబ్బుల సంచులతో ప్రజలను మోసం చేయలేరు
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయం